రోడ్డు కష్టాలు తీరేదెన్నడో..

- అంచనాలు, వర్క్ ఆర్డర్‌లు లేకుండానే పనులు ప్రారంభం
- ప్రభుత్వం తిరస్కరించడంతో పనులను మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్
- రహదారిపై దుమ్ముతో నరకయాతన పడుతున్న వెల్వడం గ్రామస్తులు
- రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసినా ఫలితం సున్నా


వెల్వడం గ్రామంలో లారీ వెనక భారీగా లేచిన దుమ్ము

జి.కొండూరు: రోడ్డు కష్టాలు ఎప్పుడు తీరతాయోనని వెల్వడం గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లైంది .. మైలవరం మండల పరిధి వెల్వడం గ్రామస్తుల పరిస్థితి. అధిక బిల్లుల కోసం కాంట్రాక్టర్ అత్యుత్సాహంతో వర్క్‌ఆర్డర్లు, ఎస్టిమేషన్లు లేకుండానే ఉన్న రోడ్డును తొలగించి కొత్త రహదారి నిర్మాణానికి హడావిడిగా పనులు ప్రారంభించారు. ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించడంతో పనులను మధ్యలోనే నిలిపివేశారు. అసంపూర్తి రహదారితో స్థానికులు, వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే వెల్వడం రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాహనాల వేగానికి లేస్తున్న దుమ్ముతో రహదారిని అనుకొని నివసిస్తున్న స్థానికుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. చేసేది లేక గ్రామస్తులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

ఐదు కిలోమీటర్ల మేర..

మైలవరం నుంచి నూజివీడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి చంద్రాల వరకు 13 కిలోమీటర్లు మేర ఉంది. వెల్వడం అయ్యప్ప స్వామి గుడి నుంచి ఐదు కిలోమీటర్ల మేర ఉన్న తారు రోడ్డును ఎటువంటి అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండానే పూర్తిగా తొలగించి దాని స్థానంలో రహదారి నిర్మాణానికి నాలుగు నెలల క్రితం పనులను ప్రారంభించారు.

రాజకీయ అండ ఉందనే..

తారు రోడ్డును పూర్తిగా తొలగించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం అడ్డుచెప్పినా సదరు కాంట్రాక్టరు తనకు స్థానికంగా రాజకీయ అండ ఉందనే అహంకారంతో అధిక బిల్లులు చేసుకునేందుకే పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తారు రోడ్డును తవ్వి వెట్‌మిక్స్ వేసిన తర్వాత నిధుల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరారు. ఈ క్రమంలో కిలోమీటరుకు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీనితో పనులను ఆపేసిన కాంట్రాక్టరు మూటా ముల్లెను సర్దుకొని వెళ్లిపోయినట్లు చర్చ జరుగుతోంది. దీనిపై మాట్లాడేందుకు అధికారులు సైతం సుముఖత వ్యక్తం చేయడంలేదు.


రహదారి పనులు నిలిచిపోవడంతో వెల్వడం గ్రామంలో అధ్వానంగా రహదారి

దుమ్ముతో నరకయాతన

ఉన్న తారురోడ్డును తొలగించి కొత్త రహదారి నిర్మాణం కోసం చేపట్టిన పనులు మధ్యలోనే ఆపేయడంతో వెల్వడం గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. ఐదు కిలోమీటర్ల మేర రహదారి మొత్తం వెట్‌మిక్స్ వేసి వదిలేయడంతో తీవ్రమైన దుమ్ము లేచి రహదారిని ఆనుకొని నివసిస్తున్న స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. భారీ వాహనాలు వెళ్లిన సమయంలో దట్టమైన దుమ్ములేచి రహదారి కనిపించక ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు వెంబడి దుకాణాలు, తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్ల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు దుమ్మును భరించలేక దుకాణాలను ఒక్కొక్కటిగా మూసేస్తున్నారు. కొత్త రోడ్డు నిర్మాణం సంగతి దేవుడెరుగు పాత దారిని అలా ఉంచి ఉంటే తమకి ఈ కష్టాలు ఉండేవి కాదని వెల్వడం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నరకయాతన పడుతున్నాం



గతంలో ఉన్న రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయని రహదారిని మొత్తం తొలగించి వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. మూడు నెలలుగా నరకయాతన పడుతున్నాం. వాహనాలు రాకపోకలతో దుమ్ములేచి ఇబ్బంది పడుతున్నాం. తినే తిండి నుంచి కట్టుకునే బట్టల వరకు సర్వం దుమ్ము చేరుతోంది. గతంలో ఉన్న రోడ్డును అలా ఉంచి ఉంటే ఇన్ని ఇబ్బందులు పడే వాళ్లం కాదు.
–శివదానం శివకృష్ణ, వెల్వడం

వ్యాధుల బారిన పడతాం



రోడ్డును పూర్తి చేయకపోతే వ్యాధుల బారిన పడతాం. ఉన్న రోడ్డును తొలగించి హడావిడిగా పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. తీవ్రమైన దుమ్ము లేచి ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలి. అప్పటి వరకు రోడ్డుపై వాటరింగ్ చేయించాలి. లేకపోతే గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడతారు.
–బి.అశోక్‌కుమార్, వెల్వడం

నైతిక విజయం వైఎస్సార్ సీపీదే

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్



జి.కొండూరు(మైలవరం): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి పురపాలక సంఘం ఎన్నికలో వైఎస్సార్ సీపీదే నైతిక విజయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ అన్నారు. కొండపల్లి పురపాలక సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత సోమవారం జోగి రమేష్ 'సాక్షి'తో మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కోర్టుకు వెళ్లిన అంశాన్ని సీల్డ్ కవర్ రూపంలో ఫలితాలను ప్రకటించడం చూస్తే అధికార పార్టీ ఓటమిని ఒప్పుకున్నట్లే అన్నారు. దొడ్డిదారిన సీల్డ్ కవర్‌లో ఫలితాలను వెల్లడించి టీడీపీ గెలిచిందని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. దమ్ముంటే చంద్రబాబునాయుడు సంవత్సర పరిపాలనపై రిఫరెండంగా కొండపల్లి పురపాలక సంఘం ఎన్నికను మరోసారి నిర్వహించి సత్తా చాటాలని సవాల్ చేశారు.

పేదలకు ప్రభుత్వ భూమిని పంచాలి

ఆగిరిపల్లి: భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంచాలని ఏలూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో అన్యాక్రాంతమైన అసైన్డ్, ప్రభుత్వ పోరంబోకు భూములను అర్హులైన పేదలకు పంచాలన్నారు. మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కనుమరుగైపోయాయన్నారు. చిన్నగిరిపల్లిలో 30 ఏళ్ల నుంచి పేదలు భూముల కోసం పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూస్వాముల కొమ్ముకాస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాక్షాత్తు మంత్రి పార్థసారథి నియోజకవర్గంలో పేదలకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండలంలో చిన్నాగిరి పల్లి, వట్టి గుడిపాడు, సురవరం, తోటపల్లి, అడవినెక్కలం గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు, అటవీ భూములు భూస్వాముల కనుసన్నల్లో ఉన్నాయని తెలిపారు. ఒక చిన్నగిరిపల్లిలోనే 600 ఎకరాలు భూస్వాముల ఆధీనంలో ఉన్నాయని వీటి కోసం పేదలు, దళితులు ఏళ్ల తరబడి ఎదురు చూడటం తప్ప నేటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని భూమి లేని పేదలకు ప్రభుత్వం భూమి పంచేంత వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సత్తు కోటేశ్వరరావు, రైతు సంఘం నేత పాపారావు పాల్గొన్నారు.


తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రాజ్యాంగాన్ని ధిక్కరించే పాలకులను నిలదీయాలి

నూజివీడు: హిందూ మతోన్మాద ఫాసిస్ట్ శక్తులు మనువాద రాజ్యాంగాన్ని తీసుకు రావాలని, అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా రాజ్యాంగాన్ని మార్చాలని పగటి కలలు కంటున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ శక్తులు తిప్పి కొట్టాలన్నారు. 2024 ఎన్నికల ఫలితాలు వారిని నిరాశపరిచాయని మోదీ అధికారం కోల్పోయే పరిస్థితుల్లో అవకాశవాదంగా చంద్రబాబు, నితీష్‌కుమార్ ఎన్డీఏలో చేరి ప్రజలకు ద్రోహం చేశారన్నారు. మోదీ పరివార్ దేశ సంపదను, పబ్లిక్ రంగ పరిశ్రమలను క్విడ్ ప్రోకోకు పాల్పడి అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. అటవీ చట్టాలను సైతం తుంగలో తొక్కి ఖనిజ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి జార్ఖండ్, చత్తీస్‌గఢ్ లాంటి చోట్ల ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులపై నరమేధం కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు.

సూర్యఘర్ లక్ష్యాలు సాధించాలి

నూజివీడు: ప్రధాన మంత్రి సూర్యఘర్ లక్ష్యాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి ఓఎస్డీ ప్రకాశరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలుపై విద్యుత్‌శాఖ అధికారులు, ఎంపీడీఓలతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ పథకం అన్ని వర్గాల వారికి వర్తిస్తుందని, ప్రభుత్వం 40 శాతం రాయితీని అందిస్తుందన్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఇచ్చిన 10 వేల సర్వీసులను త్వరలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు చెన్నా రాఘవేంద్రనాథ్, భార్గవి, విద్యుత్‌శాఖ ఏడీఈ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవో బదిలీ

తిరువూరు: తిరువూరు సమగ్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి బి.సత్యవతి చిల్లకల్లు ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నందిగామ సీడీపీవో కృష్ణకుమారి నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

రైతులకు బయోమెట్రిక్ తప్పనిసరి



చాట్రాయి: రైతులు బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. సోమవారం చాట్రాయి, ఆరుగొలనుపేట, జనార్దనవరం గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో నిర్వహిస్తున్న బయోమెట్రిక్‌ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం రావాలంటే ఈ నెల 20 లోపు ఆయా గ్రామాల్లోని రైతుసేవాకేంద్రంలో బయోమెట్రిక్ చేయించుకోవాలని ఆయన చెప్పారు.

విస్సన్నపేట: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుసేవా కేంద్రం వద్ద రైతులు బయోమెట్రిక్‌ను ఈ నెల 20వ తేదీ లోగా వేయాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక రైతు సేవాకేంద్రం వద్ద బయోమెట్రిక్ కార్యక్రమాన్ని ఏఓ సోమవారం పరిశీలించారు.

బీసీ సహాయ సంక్షేమాధికారి కార్యాలయం ప్రారంభం

మైలవరం: మైలవరంలో బీసీ సహాయ సంక్షేమాధికారి కార్యాలయం ప్రారంభించినట్లు సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.గురవమ్మ సోమవారం తెలిపారు. పరిపాలనా సౌలభ్యం కోసం మైలవరం పొందుగల రోడ్డులో కార్యాలయం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలోగానీ, 9440863241 నంబర్‌లోగానీ సంప్రదించాల్సిందిగా తెలిపారు


గంపలగూడెం ఏవోగా హరీష్‌కుమార్

తిరువూరు: గంపలగూడెం మండల వ్యవసాయాధికారిగా వల్లభనేని హరీష్‌కుమార్ నియమితులయ్యారు. ఉంగుటూరు మండలం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గంపలగూడెం ఏవో సాయిశ్రీ ఎ.కొండూరుకు బదిలీ అయ్యారు.

బైక్‌ను ఢీకొన్న కారు

గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): వేగంగా దూసుకొచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 65వ నంబర్ జాతీయ రహదారిపై కేతనకొండ వద్ద సోమవారం ప్రమాదం జరిగింది. సేకరించిన వివరాల మేరకు ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో దూసుకొచ్చి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టింది. ఘటనలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. అతని వివరాలు పోలీసుల వద్ద లేదని సమాచారం ఇచ్చారు.


కేతనకొండ వద్ద కారు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

క్లుప్తంగా

పోలీస్ విధులను అంకిత భావంతో నిర్వహించాలి

ముసునూరు: పోలీస్ విధులను అంకిత భావంతో చేయాలని ఎస్సై ఎం.చిరంజీవి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇప్పటి వరకు విధులు నిర్వహించి బదిలీ అయిన ఏఎస్సై, కానిస్టేబుళ్లను సోమవారం ఆయన ఘనంగా సన్మానించారు. ఆగిరిపల్లికి బదిలీ అయిన ఏఎస్సై వెంకట్రావు, నూజివీడు పట్టణానికి, ఏలూరు రైల్వేకు బదిలీ అయిన హెడ్ కానిస్టేబుళ్లు నాగేంద్రరావు, రమణ, మండవల్లికి బదిలీ అయిన కానిస్టేబుల్ మహేష్‌ను, ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్ రమణను ఆయన సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



మైలవరం: యోగాతో పరిపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌క్రాస్ విద్యార్థులు యోగాసనాలు వేశారు. వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ యోగాసనాలు వేస్తే మానసిక ఉల్లాసం, ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ స్వామి, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి ఆఫీసర్‌లు ఫణికుమార్, రాముడు పాల్గొన్నారు.

తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌గా మనోజ



తిరువూరు: తిరువూరు నగరపంచాయతీ కమిషనర్‌గా కె.మనోజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లోవరాజు నందిగామకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కదిరి నుంచి మనోజ నియమితులయ్యారు. గతంలో ఆమె తిరువూరు నగరపంచాయతీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

పీజీఆర్ఎస్‌లో 22 అర్జీలు



నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 22 అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ అనిల్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని, గడువులోగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఒకవేళ పరిష్కరించడానికి వీలు కాకపోతే దానికి కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ కె.మాధవీ ప్రియానంద, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హెచ్‌ఓ ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్ బదిలీ

నూజివీడు: ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ బదిలీ అయ్యారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌గా, జనరల్ సర్జన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేంద్రసింగ్‌ను ప్రభుత్వం తెనాలి జిల్లా ఆస్పత్రికి బదిలీ చేసింది. ఆయన స్థానంలో నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న మంత్రూ నాయక్‌ను నియమించారు. నరేంద్రసింగ్ గైనకాలజిస్టుగా 20 ఏళ్లకు పైగా నూజివీడు ప్రాంత ప్రజలకు సేవలు అందించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ తెలిపారు. సోమవారం చాట్రాయిలో వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని ఆవాస్ యోజన, ప్రధానమంత్రి సురక్ష, బీమా యోజన, హర్‌ఘర్ యోజనను చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఓబిళ్లనేని రాజా, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చక్రధర్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మైలవరం: మైలవరం మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. మైలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభా మందిరంలో జరిగే కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల మండల అధికారులు తప్పక హాజరు కావాల్సిందిగా ఎంపీడీఓ తెలిపారు.

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ మైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. కొత్తూరు తాడేపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కర్నాటి రాంబాబు సోమవారం మాజీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాంబాబును శాలువా కప్పి అభినందించారు. పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకుందామన్నారు. రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బయ్యారపు కిషోర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మాజీ మంత్రి జోగి రమేష్‌ను గెలిపించుకుందామన్నారు. రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగి రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు బయ్యారపు కిషోర్, సొసైటీ మాజీ చైర్మన్ లక్కంరాజు పుండరీక వరద వర్మ, గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, జిల్లా బీసీ ప్రధాన కార్యదర్శి పరికెల శ్రీనివాసరావు,సాంస్కృతిక విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు మెండెం సుబ్బారావు,ఉప సర్పంచి నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ కమిటీ కో కన్వీనర్‌గా బద్రి వీరాస్వామి, యూత్ కన్వీనర్ దొంతమాల వీరాస్వామి, కమిటీ సభ్యులు బండి పురుషోత్తం, జడ రాజా, పజ్జూరు శ్రీనివాసరావు, తోటకూర సత్యనారాయణ, రాచగిరి వెంకయ్య బాబు, పామర్తి నాగరాజు, ఎస్‌కె బాజీ, చిగురుపల్లి బాబురావు, కడిమి ప్రమోద్, తలగడదివి చిన్న రెడ్డమ్మ, గారపాటి బాలయ్య,బంధాల వెంకయ్య(లాజర్) నియమితులయ్యారు.

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు వైఎస్సార్ సీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని మాజీ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. దాములూరు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. శ్రీరామ సాంబశివరావును గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జోగి రమేష్ సాంబశివరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రాంబాబును శాలువాతో సత్కరిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్


ఇబ్రహీంపట్నంలో సాంబశివరావును అభినందిస్తున్న దృశ్యం

ప్రజలకు 'కూటమి' వెన్నుపోటు

వైఎస్సార్ సీపీ తిరువూరు ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. సోమవారం తిరువూరులో '5 కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయిందన్నారు. ప్రతి రోజూ వైఎస్సార్ సీపీపై, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా చతికిలపడిందని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం దేశంలో ఇదేనన్నారు. పుస్తకావిష్కరణలో తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, కోడూరు సర్పంచి తేళ్లూరి సురేష్, పార్టీ నాయకులు బొర్రా మోహనరావు, షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


తిరువూరులో పుస్తకావిష్కరణ చేస్తున్న స్వామిదాసు, వైఎస్సార్ సీపీ నేతలు

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ఆగిరిపల్లి: మండలంలోని అమ్మవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి మాట్లాడుతూ పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులు ధరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయురాలు ఇందుమతిని సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి: మండలంలో బదిలీపై వెళుతున్న ఇద్దరు ఉపాధ్యాయులను ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈదులగూడెం నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయురాలు మద్దాలి నాగమణిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. చిన్నాగిరిపల్లి పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఇందుమతిని సర్పంచ్ పల్లగాని జమదగ్ని, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి


తిరువూరు నగరపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

తిరువూరు: తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ కార్మికులు సోమవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. అతితక్కువ వేతనాలతో పనిచేసే తమకు తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేయట్లేదని, తమ పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా అందట్లేదని కార్మికులు వాపోయారు. తమకు వెంటనే ప్రభుత్వ పథకాలను అమలు చేయడంతో పాటు పనికి తగిన వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటునూ్న "యార్లగడ్డ కన్‌స్ట్రక్షన్స్" నూజివీడు తరఫున మేనేజింగ్ పార్టనర్ ఏలూరుజిల్లా, నూజివీడు మండలం, నూజివీడు పట్టణం, రామాయమ్మారావుపేట, రోడ్ నెంబరు : 25-117 కాపురస్థులు యార్లగడ్డ శివరామకృష్ణ ప్రసాద్ గారి కుమారుడు వెంకట కిషోర్ గారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా ! నా క్లయింటు ఎన్.టి.ఆర్.జిల్లా, విస్సన్నపేట మండలం, పుట్రేల గ్రామ కాపురస్థులు 1) (లేటు) కోటగిరి నరసింహారావు గారి భార్య కోటగిరి విజయమ్మ, 2) (లేటు) కోటగిరి నరసింహారావు గారి కుమారుడు కోటగిరి శోభనాద్రిరావు, 3) కోటగిరి శోభనాద్రిరావు గారి కుమార్తె కోటగిరి ప్రశాంతి, 4). ఎన్.టి.ఆర్. జిల్లా, ఎ. కొండూరు మండలం, దీపలపాడు గ్రామ, పాతూరు గ్రామ కాపురస్థురాలు శెట్టిపల్లి శేష పిచ్చయ్యారావు గారి భార్య శెట్టిపల్లి గీత, 5). ఏలూరుజిల్లా, ఏలూరు పట్టణం, రామచంద్రరావుపేట, బెండపూడి వారి వీధి కాపురస్థులు కోటగిరి ప్రదీప్ గారి భార్య కోటగిరి తనూజ, మరియు 6) తెలంగాణా రాష్ట్రం, హైద్రాబాద్ నగరం, గచ్చిబౌలి కాపురస్థులు దామెర నితీష్ గారి భార్య శెట్టిపల్లి నీరజ అనువారల వద్దనుండి సదరు కోటగిరి విజయమ్మ గారికి భర్త గారున్నూ, కోటగిరి శోభనాద్రిరావు, శెట్టిపల్లి గీత గార్లకు తండ్రిగారున్నూ, కోటగిరి ప్రశాంతి గారికి తాత (తండ్రి తండ్రి) గారున్నూ, కోటగిరి తనూజ, శెట్టిపల్లి నీరజ గార్లకు తాతగారు (తల్లితండ్రి) గారున్నూ అయిన కోటగిరి నరసింహారావు గారు ది.10-08-2016వ తేదీనాటి వీలునామా ద్వారా సంక్రమింపచేసిన స్థిరాస్థి అయిన ఏలూరుజిల్లా, నూజివీడు మండలం, నూజివీడు మునిసిపల్ పరిధిలో చేరిన, నూజివీడు పట్టణములోని ఆర్.ఎస్.నెంబరు : 587 నందు ఎల్. పి. నెంబరు : 294/87గా అప్రూవల్ కాబడిన ప్లాను దాఖలా ప్లాటు నెంబరు : 6గా గల 738 చదరపు గజాలున్నూ, మరియు ప్లాటునెంబరు : 7 గా గల 738 చ.గ.లున్నూ మొత్తం 1476 చ.గ.లు స్థిరాస్థి నిమిత్తం స్థలమును కొనుగోలు చేయుటకు అగ్రిమెంటు కుదుర్చుకొనియున్నారు. కావున సదరు విక్రయదారులకు వీలునామా ద్వారా సంక్రమించబడిన సదరు విక్రయ ఆస్థికి సంబంధించి ఎవ్వరికైనా సరే ఏవిధమైన ఆక్షేపణలు కానీ, అభ్యంతరములు కానీ వున్న యెడల యీ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా నా క్లయింటుకు కానీ, నాకు గానీ స్వయంగా తెలియజేయగలరు. సదరు విధంగా ఏవిధమైన ఆక్షేపణలు కానీ, అభ్యంతరములు కానీ రాని యెడల సదరాస్థి నిర్వివాద, నిస్పేచీ ఆస్తిగా పరిగణించబడును. గడువు దాటిన తరువాత వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు పరిగణలోనికి తీసుకొనబడవు. అట్టివి సదరాస్థిలో నా క్లయింటుకు గల హక్కులను భంగపర్చజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

నూజివీడు,
తేదీ : 16-06-2025. పల్లగాని రాంబాబు
న్యాయవాది, సెల్ : 9848153188.